సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతుంది.

వివరాలు IIలో ▸



టెండర్ల జాతర

మద్యం దుకాణాల కోసం టెండర్ల దాఖలు ప్రక్రియ ఊపందుకుంటుంది.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం 34.8 /21.6

వాతావరణం

ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉదయం నుంచి రాత్రి వరకు అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉంది.

పరేడ్ మైదానంలో వేడుకలు ఇలా...

- ఉదయం 10.50 గంటలకు ఎస్పీ నరసింహ రాక
- 10.55 గంటలకు కలెక్టర్ రవినాయక్ రాక
- 10.59 గంటలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాక
- 11.00 గంటలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌చే జెండా వందనం
- 11.02 గంటలకు పోలీస్ కవాతు
- 11.15 నుంచి 11.45 గంటలకు మంత్రి సందేశం
- 11.45 గంటలకు స్వాతంత్య్ర సమరయోధుల సన్మానం
- 11.50: సాంస్కృతిక కార్యక్రమాలు
- మధ్యాహ్నం 12:50 గంటల నుంచి శకటాల ప్రదర్శన
- 1:30 గంటలకు కార్యక్రమం ముగింపు

- జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఎస్పీ కార్యాలయంతో పాటు ప్రధాన చౌరస్తాలు, ముఖ్య పట్టణాలు పోలీసుల నిఘాలో ఉండనున్నాయి.



విద్యుత్ కాంతుల్లో కలెక్టరేట్ సమీకృత భవనం

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

- పరేడ్ మైదానాన్ని సిద్ధం చేసిన అధికారులు
- నూతన కలెక్టరేట్‌లో తొలిసారి వేడుకలు
- విద్యుద్దీపాల అలంకరణలో ప్రభుత్వ కార్యాలయాలు

పాలమూరు/జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జెండా పండుగకు జిల్లా ముస్తాబవుతుంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను సిద్ధం చేశారు. కలెక్టరేట్, జెడ్పీ, ఎస్పీ కార్యాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం రాత్రి విద్యుత్ దీపాల అలంకరణతో ప్రభుత్వ కార్యాలయాలు ధగధగ మెరిసిపోయాయి. పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం జరగనున్న వేడుకల కోసం ఏర్పాటు పూర్తి చేశారు. అందులో భాగంగా సోమవారం ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరేడ్ మైదానంలో కవాతు సాధన చేశారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జి.రవినాయక్, ఎస్పీ కె.నరసింహ, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొననున్నారు. కలెక్టరేట్‌తో పాటు ఎస్పీ కార్యాలయం ఇతర ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్‌తో పాటు, డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేశారు.

■ కొత్త కలెక్టరేట్ సమీకృత భవనంలో తొలిసారిగా స్వాతంత్య్ర వేడుకలు జరుగుతున్నాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉండడంతో కలెక్టర్ రవినాయక్ జాతీయజెండాను ఎగురవేస్తారు. కార్యాలయాన్ని త్రివర్ణ తోరణాలతో అలంకరించారు. ప్రాంగణం మొత్తాన్ని శుభ్రం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంపై జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి జాతీయ జెండా ఎగురవేస్తారు. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జెడ్పీసీఈఓ జ్యోతి అధికారులను ఆదేశించారు.



పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



తోరణాలు కడుతున్న కలెక్టరేట్ సిబ్బంది

నేడు పీయూలో భారీ జాతీయ జెండావిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన భారీ జాతీయ జెండాను మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించనున్నట్లు రిజిస్ట్రార్ గిరిజ ప్రకటనలో తెలిపారు. జెండా ఏర్పాటుకు దాతలు సహకరించినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు రూ.17.30 లక్షలతో నిర్మించిన బాస్కెట్‌బాల్, రూ.5.70 లక్షల వ్యయంతో నిర్మించిన బ్యాడ్మింటన్ కోర్టులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

జాతీయ జెండాల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా డీఆర్‌డీఓ అధికారులు స్థానిక మున్సిపాలిటీకి సుమారు తొమ్మిది వేల జాతీయ జెండాలను అందజేశారు. జిల్లాకేంద్రంలోని ఒక్కో వార్డుకు 180 చొప్పున కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సోమవారం పట్టణ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఇంటింటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని వారు కోరారు.



జైల్‌ఖానా వెనుక ప్రాంతంలోని జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జిల్లాలో విస్తృతంగా తనిఖీలు



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్‌తో పాటు జిల్లాలో ఉన్న ముఖ్య పట్టణాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. నూతన కలెక్టరేట్, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో ప్రయాణికుల దగ్గర ఉన్న బ్యాగులు, స్టేషన్ పరిసర ప్రాంతాలను తనిఖీలు చేశారు. జాగిలాలతో క్లాక్‌టవర్, తెలంగాణ చౌరస్తాలతో పాటు పెద్ద దుకాణాలు పరిసర ప్రాంతాలు, రోడ్లపై ఉన్న చెత్తకుండీలను తనిఖీలు చేశారు. అలాగే ఆర్‌అండ్‌బీలో ఉన్న అమరవీరుల స్థూపం, క్లాక్‌టవర్ అమరవీరుల స్థూపం, ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణ సముదాయాలతో పాటు అనుమానంగా ఉన్న వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

17మంది పోలీసులకు సేవా పతకాలు

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ పోలీస్ శాఖలో పనిచేస్తున్న 17మందికి సేవా పతకాలు, 39 మందికి ప్రశంస పత్రాలు ఇవ్వనున్నారు.

251 మందికి అవార్డులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంస అవార్డుల జాబితాను సోమవారం రాత్రి కలెక్టర్ రవినాయక్ విడుదల చేశారు. అన్ని శాఖలకు చెందిన 251 మంది ఉద్యోగుల పేర్లను ప్రకటించారు. ఇందులో జిల్లా అధికారులు 18 మంది, కలెక్టర్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు 16 మంది, డీఎంహెచ్ఓలో 11, జనరల్ ఆస్పత్రిలో 13, పోలీస్ శాఖలో 39, మున్సిపాలిటీలో ఏడుగురు, డీఆర్‌డీఓలో 11, అగ్రికల్చర్‌లో ఆరుగురు, జెడ్పీ, రెవెన్యూ శాఖలో ఐదుగురేసి చొప్పున... డీపీఓ, విద్యాశాఖ, బీసీ సంక్షేమ శాఖలో నలుగురేసి చొప్పున.. మెడికల్ కాలేజీ, డీసీఓ, వెటర్నరీ, ఆర్‌అండ్‌బీ, ల్యాండ్ రికార్డ్స్, మిషన్ భగీరథలో ఇంట్రా, సీడీపీఓ, డీసీ సోషల్ వెల్ఫేర్, వెటర్నటీ, ఆర్‌అండ్‌బీలో ముగ్గురేసి చొప్పున.. ఆర్‌డీఓ కార్యాలయం, డీసీఎస్ఓ, సీఎస్‌సీ, మార్కెటింగ్, గ్రిడ్, సీపీఓ, మైనార్టీ సంక్షేమ శాఖ, పీఆర్ ఇంజినీరింగ్, టీఎస్ఎస్‌పీడీసీఎల్, ట్రైబల్ వెల్ఫేర్, డీపీఆర్ఓలో ఇద్దరేసి ఉద్యోగులు ఉన్నారు. వీరికి మంగళవారం పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేస్తారు.

కార్గిల్ యుద్ధవీరులకు సన్మానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్–4, 9 ఆధ్వర్యంలో మేరి మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు రాములు, కాశన్న, బాలరాజు, మల్లికార్జున్, హనుమంతును సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్‌కుమార్, బండి పర్వతాలు, నాగసుధ తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ ఆధ్వర్యంలో విభజన స్మృతి దివాస్



తపాలాశాఖ కార్యాలయంలో విభజన స్మృతి దివాస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్‌లో సూపరింటెండెంట్ బి.నందా ఆధ్వర్యంలో సోమవారం విభజన స్మృతి దివాస్ సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. దేశ చరిత్రలో విభజన కష్టాలను ఎన్నటికీ మరిచిపోలేమని, ప్రజల త్యాగాలు, పోరాటాలను గుర్తు చేసుకోవాలన్నారు. అప్పటి ద్వేషం, హింస కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలను స్మరించుకోవడం కోసం తపాలాశాఖ ఆధ్వర్యంలో విభజన స్మృతి దివాస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ రవినాయక్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. ప్రతి వారం ఫిర్యాదుల పరిష్కారానికి కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. రెవెన్యూ భూములకు సంబంధించి తహసీల్దారులతో నిర్వహించిన వీసీలో మాట్లాడుతూ వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ నటరాజు, జెడ్పీ సీఈఓ జ్యోతి పాల్గొన్నారు.

'తొలి జాబితా'పై ఉత్కంఠ

హాట్‌టాపిక్‌గా అసెంబ్లీ అభ్యర్థిత్వాలు

- బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీలో సైతం..
- 'కారు' ఫస్ట్ లిస్ట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి పది మంది?
- వచ్చే నెల మూడో వారంలోగా హస్తం అభ్యర్థిత్వాల ఖరారు
- 'కమలం'లోనూ కొనసాగుతున్న ప్రక్రియ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పావులు కదుపుతున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల బలాబలాలపై ఇది వరకే వివిధ సంస్థలతో పలు దఫాలుగా సర్వేలు చేపట్టాయి. ఇందులో వచ్చిన ఫలితాలను పరిశీలించిన ఆయా పార్టీల అధిష్టానాలు ఎన్నికల పోరుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా అధికార బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలతో దూకుడు పెంచగా.. **ఈసారి సత్తా చాటాలనే సంకల్పంతో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ కార్యాచరణను వేగవంతం చేశాయి. ఇందులో భాగంగా ఎన్నికలకు** నాలుగు నెలల ముందుగానే పలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బరిలో నిలిచే అభ్యర్థులను ప్రకటించేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. మూడు ప్రధాన పార్టీలకు సంబంధించి ఈ నెలాఖరులోపే తొలి జాబితా వెల్లడికానున్నట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతుండడంతో ఉమ్మడి పాలమూరుకు చెందిన ఆయా పార్టీల ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.



మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మహబూబ్‌నగర్, నారాయణపేట, జడ్చర్ల, దేవరకద్ర, షాద్‌నగర్, మక్తల్, కొడంగల్.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, గద్వాల, అలంపూర్, వనపర్తి సెగ్మెంట్‌లు ఉన్నాయి. అధికార పార్టీ బీఆర్ఎస్‌కు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులపై ఇదివరకే కసరత్తు ప్రారంభించిన ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ వారం లేదంటే రెండు వారాల్లోపు జంబో లిస్టును ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీఆర్ఎస్‌లో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్‌కు సంబంధించి తొలి జాబితాలో ఎవరెవరి పేర్లు ఉంటాయనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం పది అసెంబ్లీ స్థానాల్లో సిట్టింగ్ అభ్యర్థులకు ఫస్ట్ లిస్ట్‌లో చోటు దక్కినట్లు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో మూడు అసెంబ్లీ, మహబూబ్‌నగర్ ఎంపీ నియోజకవర్గంలో ఒక అసెంబ్లీ స్థానంలో అభ్యర్థిత్వాలను పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ప్రజల్లో వ్యతిరేకత, సామాజిక వర్గ ప్రాతినిధ్యం అంశాలతో నాగర్‌కర్నూల్‌లో ఒకటి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మరొక అసెంబ్లీ స్థానానికి అభ్యర్థులను ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టవచ్చనే చర్చ జరుగుతోంది. నాగర్‌కర్నూల్ పరిధిలోని మిగతా రెండు స్థానాల్లో ఒక సిట్టింగ్ అభ్యర్థికే మళ్లీ అవకాశం కల్పించనుండగా.. మరో స్థానంపై తుది కసరత్తు పూర్తయిన తర్వాత అభ్యర్థులను ప్రకటించనున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్, బీజేపీలో..

హస్తం పార్టీకి సంబంధించి అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలవాలనుకునే అభ్యర్థుల నుంచి ఈ నెల 18 నుంచి దరఖాస్తులు తీసుకోనున్నట్లు సమాచారం. ఆ తర్వాత ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) సమావేశమై అర్జీలను జల్లెడ పట్టనున్నారు. ఆ తర్వాత స్క్రీనింగ్ కమిటీ భేటీ జరగనుండగా.. ముఖ్యుల జాబితాను సెంటర్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ)కి పంపనున్నారు. అక్కడ అభ్యర్థులను ఫైనల్ చేసి సీడబ్ల్యూసీ ఆమోదానికి పంపించనున్నారు. ఆమోదం పొందిన తర్వాత అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. సెప్టెంబర్ మూడో వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేసి అభ్యర్థుల పేర్లను అధికారికంగా వెల్లడించనున్నారు. అయితే ఉమ్మడి పాలమూరులో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, షాద్‌నగర్, కొడంగల్, అలంపూర్ అభ్యర్థుల ఎంపిక పూర్తయినట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా బీజేపీలో అభ్యర్థిత్వాల ఎంపికపై కసరత్తు కొనసాగుతోంది. గద్వాల నుంచి మాజీ మంత్రి డీకే అరుణ, మహబూబ్‌నగర్ నుంచి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, కల్వకుర్తి నుంచి ఆచారి, అచ్చంపేట నుంచి సతీష్ మాదిగ పేర్లు వినిపిస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో ముందస్తుగా ఎన్నికల సందడి నెలకొంది.

వన నర్సరీల పరిశీలన

మిడ్జిల్: మండలంలోని రాణిపేట, వల్లభ్‌రావుపల్లి, వాడ్యాల్, వేములలో సోమవారం జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ యాదయ్య పర్యటించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మార్కులు కేటాయించే ప్రక్రియలో భాగంగా వన నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశానవాటికల నిర్మాణం, సేంద్రియ ఎరువుల తయారీ అంశాలను పరిశీలించారు. 70 మార్కులు వస్తే వారిని రెగ్యులర్ చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. ఆయన వెంట డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ తదితరులు ఉన్నారు.



ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి: మంత్రి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎస్సీ, ఎస్టీలు ఉద్యోగాల కోసం కృషి చేయడమే కాకుండా, ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో డిక్కి ఆధ్వర్యంలో నిర్వహించిన యువతకు సమగ్ర వ్యాపార నిర్వహణ అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు ఇంకా పేదలుగానే ఉండకుండా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. డిక్కి ప్రాంతీయ కార్యాలయం నిర్మాణం కోసం రూ.10లక్షల నిధులను అందజేయనున్నట్లు తెలిపారు. జంగమ సమాజం వేద పాఠశాలకు స్థలం, నీలికుల సంక్షేమ భవనం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం స్థానిక మోనప్పగుట్టలోని మోనేశ్వర స్వామి దేవాలయంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, డిక్కి రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు తహసీల్దార్లకు పోస్టింగ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇటీవల ఏడుగురి తహసీల్దార్లకు పోస్టింగ్ కేటాయించలేదు. ఎట్టకేలకు సోమవారం వారికి మండలాలు కేటాయిస్తూ కలెక్టర్ రవినాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో మహబూబ్‌నగర్ అర్బన్ నాగార్జున, కోయిల్‌కొండకు భరత్‌గౌడ్, మహమ్మదాబాద్‌కు ఏసయ్య, దేవరకద్రకు శ్రీనివాస్, కౌకుంట్లకు ఎల్లన్న, భూత్పూర్‌కు భానుకిరణ్, చిన్నచింతకుంట కృష్ణయ్య ఉన్నారు. ఇందులో ఎఫ్‌సీఐ గోదాం ఇన్‌చార్జ్‌గా ఉన్న నయాబ్ తహసీల్దార్ నాగార్జున్ పదోన్నతిపై మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్‌గా వచ్చారు.

నలుగురు నయాబ్ తహసీల్దార్లకు పోస్టింగ్

తహసీల్దార్లతో పాటు నయాబ్ తహసీల్దార్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో మహబూబ్‌నగర్ సివిల్ సప్లయిలో పనిచేస్తున్న యూసుఫ్‌కు నాగర్‌కర్నూల్, హన్వాడలో పని చేస్తున్న సతీష్‌కుమార్ నారాయణపేట్‌కు, జడ్చర్లలో పని చేస్తున్న వెంకటేశ్వర్‌కి వికారాబాద్, చిన్నచింతకుంటలో పని చేస్తున్న జమీల్‌కు నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయిస్తు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రవీందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి

నవాబుపేట: మైసమ్మ దేవాలయంలో మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తుండగా ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని రుద్రారం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పురుషోత్తం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుద్రారం చెందిన చాకలి పావని(24) భర్త శివకుమార్, బంధువులతో కలిసి మైసమ్మ దేవాలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ట్రాక్టర్‌పై వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా రుద్రారం శివారులోకి రాగానే వర్షం రావటంతో శివకుమార్ ట్రాక్టర్‌ను వేగంగా నడిపాడు. దీంతో ట్రాక్టర్ ఇంజన్‌పై భర్త పక్కనే కూర్చున్న పావని వేగానికి ఎగిరి కిందపడింది. వెంటనే ట్రాలీ పావని శరీరంపై నుంచి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అతి వేగంగా, అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి కూతురి మృతికి కారణమైన శివకుమార్‌పై చర్య తీసుకోవాలని తల్లి మిద్దె సుజాత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కావలి హన్మంతు (ఫైల్)

మద్దూరు: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని చింతల్‌దిన్నెలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కావలి హన్మంతు(53) భార్య నర్సింగమ్మతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. వరిమడులకు నీళ్లు పెట్టడానికి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి ఏబీ స్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఉస్మాన్ కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనకు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

పాఠశాలకు వెళ్లడం ఇష్టంలేక

- పురుగు మందు తాగి ఆత్మహత్య

అచ్చంపేట రూరల్: స్కూల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థి పురుగుల మందు తాగాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగాపూర్‌కు చెందిన ముడావత్ బాలుకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు శివ(13) అచ్చంపేటలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తరుచూ పాఠశాలకు గైర్హాజరయ్యేవాడని గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లాలని శివను తల్లిదండ్రులు మందలించారు. పాఠశాలకు వెళ్లడం ఇష్టంలేని విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పత్తి చేనుకు ఉపయోగించే పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి హనుమాన్ తండాకు చెందిన మెగ్యానాయక్, లక్ష్మణ్ నాయక్ సోమవారం ఉదయం 9గంటలకు ద్విచక్ర వాహనంపై పిల్లల మర్రి నుంచి అప్పన్నపల్లికి బయలుదేరారు. మార్గమధ్యలో కరెంట్ ఆఫీస్ ఎదుట మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. బాధితుడి తమ్ముడు సోమ్లు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ విఠల్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫోర్జరీ కేసులో మరో వ్యక్తి అరెస్ట్

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ శివారులో గల సర్వే నంబర్లు 369, 370 వెంచర్లలో ఉన్న ప్లాట్లను ఫోర్జరీ సంతకంతో కాజేసేందుకు ప్రయత్నించిన 11 మందిపై జూన్ 7న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి సీఐ రజితారెడ్డి ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. అప్పట్లో పరారీలో ఉన్న అమిస్తాపూర్‌కు చెందిన కెంద్యాల నరేందర్‌ను సోమవారం సీఐ రామకృష్ణ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ప్రకటనలో తెలిపారు.

వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర వాలీబాల్ అకాడమీలో అడ్మిషన్ల కోసం ఈనెల 17న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14–18 ఏళ్ల బాల, బాలికలు ఎంపికల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణపత్రం, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో 17న ఉదయం 8 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం 9848364143 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నాలుగేళ్ల తర్వాత శిక్ష..

బాలిక హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

- బెయిల్ కోసం విశ్వ ప్రయత్నాలు.. పక్కా ఆధారాలతో కేసు ముందుకు..
- బండరాయితో కొట్టి హత్యచేసిన నవీన్‌రెడ్డి
- 2019లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన


నిందితుడు నవీన్‌రెడ్డి



నిందితుడిని ఉరి తీయాలని జడ్చర్లలో ఆందోళన చేస్తున్న ప్రజలు (ఫైల్)

జడ్చర్ల: పట్టణానికి చెందిన బాలిక(15)ను అతి దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించారు. పదో తరగతి చదువుతున్న బాలికకు నిందితుడు ఏనుగు నవీన్‌రెడ్డి(30) మాయమాటలు చెప్పి పట్టణ శివారులోని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి బండరాయితో అతి దారుణంగా హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై అప్పట్లో మహిళలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా స్పందించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళనలు చేసి డిమాండ్ చేశారు.

ఫాస్ట్‌ట్రాక్‌లో విచారణ..

బాలిక హత్య కేసును రేప్ అండ్ పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా పోలీస్ విచారణ అధికారి వీరస్వామి కేసుకు సంబంధించిన పక్కా ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలతోపాటు హత్యకు సంబంధించిన అన్ని కోణాల్లో సేకరించిన సాక్ష్యాలను కోర్టుకు అందజేశారు. నిందితుడు నవీన్‌రెడ్డి హైకోర్టులో పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా పోలీసులు హత్యకు సంబంధించిన ఆధారాలను ఎప్పటికప్పుడు సమర్పించి బెయిల్ రాకుండా అడ్డుకున్నారు. దీంతో నవీన్‌రెడ్డి ఇప్పటి వరకు జైలులోనే రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

నేరం రుజువు కావడంతో..

2019 ఆగస్టు 28న జడ్చర్లకు చెందిన బాలికను నిందితుడు పక్కా ప్రణాళికతో హత్య చేసినట్లు కోర్టులో రుజువు కావడంతో ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బి.శ్రీనివాసులు నిందితుడు నవీన్‌రెడ్డికి జీవిత ఖైదుతోపాటు రూ.13,500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పును వెలువరించారు. స్పెషల్ పీపీ నర్సింగరావు కేసుకు సంబంధించి తన వాదనలను వినిపించారు. నాలుగేళ్లపాటు కోర్టులో కేసు విచారణ కొనసాగింది.

కారులో ఎక్కి వెళ్లిందన్న సమాచారంతో..

హౌసింగ్ బోర్డు సమీపంలో రోడ్డు పక్కన పార్కు చేసిన ఓ వ్యాగనార్ కారులో బాలిక ఎక్కి వెళ్లినట్లు అక్కడి సీసీ ఫుటేజీ ద్వారా తెలుసుకున్న పోలీసులు బాలానగర్ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద జడ్చర్ల వైపు వచ్చి కేవలం అరగంట వ్యవధిలోనే మళ్లీ హైదరాబాద్ వైపు వెళ్లిన వ్యాగనార్ కారును అనుమానించారు. రోడ్డు రవాణా శాఖ అధికారుల సహకారంతో కారు నంబర్ ఆధారంగా యజమాని చిరునామాను సేకరించి దర్యాప్తు వేగవంతం చేశారు.

నిందితుడి పట్టివేత..

హైదరాబాద్ శివారులోని హయత్‌నగర్ మండలం కోహెడ గ్రామానికి చెందిన ఏనుగు నవీన్‌రెడ్డి(26)ని పోలీసులు అరెస్ట్ చేసి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు హైదరాబాద్‌లోని వాహన వీల్ అలయ్‌మెంట్ షాప్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. నిందితుడు నవీన్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన సమాచారంతోనే బాలిక హత్య విషయం వెలుగులోకి వచ్చింది. జడ్చర్ల శివారులోని నిర్జన ప్రదేశంలో మరుసటి రోజు బాలిక మృతదేహాన్ని గుర్తించారు.

ఫేస్‌బుక్‌తో వల విసిరి..

పెద్దగా చదువుకోని నవీన్‌రెడ్డి ఫేస్‌బుక్‌లో జడ్చర్లకు చెందిన బాలికకు వల విసిరాడు. కేవలం మూడు నెలల్లోనే వీరు అత్యంత సన్నిహితులుగా మారి తరుచు వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా చాటింగ్ చేసుకునేవారని పోలీసులు గుర్తించారు. కొంత చనువు ఏర్పడటంతో వ్యాగనార్ కారులో జడ్చర్లకు వచ్చి బాలికను కలిసి హత్య చేశాడు.

బయటకు రాకుండా చేయాలి..

తమ కూతురును బలి తీసుకున్న నిందితుడు నవీన్‌రెడ్డికి జీవిత ఖైదు శిక్ష విధించడం హర్షనీయమని బాలిక తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇలాంటి వారు సమాజంలో ఉండేందుకు అనర్హులని, చట్టప్రకారం జీవిత ఖైదు, ఉరిశిక్ష వంటి కఠిన శిక్షలు విధించాలని బాలిక తండ్రి అభిప్రాయపడ్డారు. నిందితుడు జీవించినంత కాలం జైలులోనే ఉండాలని కోరారు.

అప్పుడు ఏం జరిగిందంటే..

జడ్చర్ల హౌసింగ్‌బోర్డు కాలనీలోని తమ నివాసం నుంచి బాలిక 2019 ఆగస్టు 28న సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో పెన్ను, పెన్సిల్ ఇతర వస్తువులు కొనుగోలు కోసం జడ్చర్ల– మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపైకి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చి వెంటనే మళ్లీ ఏదో కొనేందుకు రోడ్డుపైకి వెళ్లి తిరిగి రాలేదు. దాదాపు గంటపాటు ఎదురు చూసిన తల్లి కూతురు ఇంటికి రాలేదని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న భర్తకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఆయన ఇంటికి చేరుకుని చుట్టుపక్కల విచారించారు. తన కూతురు దగ్గర ఉన్న ఫోన్‌కు కాల్ చేయగా రింగ్ వచ్చినా.. ఎత్తలేదు. రాత్రి 7 గంటల తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి దర్యాప్తు చేపట్టారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు

తప్పు చేస్తే తప్పనిసరి శిక్ష అనుభవించాల్సిందేనని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. కేసుకు సంబంధించి కోర్టులో సరైన ఆధారాలు సమర్పించామని, కోర్టు తీర్పు హర్షనీయమని చెప్పారు.

పంచలోహ విగ్రహాలు అపహరణ


చోరీకి గురైన విగ్రహాలు ఇవే..

మహబూబ్‌నగర్ క్రైం: అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి పంచలోహ విగ్రహాలు ఎత్తుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌పురలో ఉన్న పవనపుత్ర వీరాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించారు. బంగారం పూత, వెండి, ఇత్తడితో తయారు చేసిన దాదాపు 30కేజీల రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. ఆలయం గురించి అవగాహన ఉన్న వ్యక్తులు చేశారా? లేదా ఏదైనా ముఠా చోరీకి పాల్పడ్డారా? అనేది తెలియాల్సి ఉంది. అయితే ఆలయంలోనే పూజారి నివాసం ఉంటున్న ఎలాంటి శబ్దం రాకుండా దొంగతనం చేసినట్లు తెలుస్తోంది. ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గుడి వెనుక వదిలేసి వెళ్లారు. ఆలయాన్ని క్లూస్‌టీం పోలీసులతో పాటు వన్‌టౌన్ పోలీసులు సందర్శించి ఆధారాలు సేకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సైదులు వెల్లడించారు. ఆలయాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించి, ఆలయ కమిటీ నిర్వాహకులతో వివరాలు తెలుసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

డీసీఎం బోల్తా: స్తంభించిన ట్రాఫిక్


జానంపేట శివారులో రోడ్డుపై పడిపోయిన డీసీఎం

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట శివారులోని 44వ జాతీయ రహదారిపై డీసీఎం బోల్తాపడడంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నిస్సార్ డీసీఎంలో పార్సిళ్ల లోడుతో బెంగళూర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఆదివారం రాత్రి గాజులపేట స్టేజి దాటిన తర్వాత జానంపేట శివారులో డీసీఎంకు ట్రాక్టర్ అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో బ్రేక్ వేయగా, అదుపు తప్పిన డీసీఎం రోడ్డుపై బోల్తాపడింది. డ్రైవర్ నిస్సార్‌కు గాయాలయ్యాయి. ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్ పరారయ్యాడు. డీసీఎం రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు, ఎల్‌అండ్‌టీ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని డీసీఎంను రోడ్డు పక్కకు తీయించారు. గంట తర్వాత బెంగళూర్ రోడ్డుపై వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. అప్పటి వరకు గాజులపేట స్టేజీ నుంచి రాంగ్‌రూట్లో వాహనాలు చక్రాపూర్ స్టేజీ వరకు వెళ్లి అక్కడి నుంచి బెంగళూర్ రోడ్డుపై వెళ్లిపోయాయి. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

శాంతి భద్రతల సమస్యలు తలెత్తరాదు


చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్పీ నర్సింహ

చిన్నచింతకుంట: ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎస్పీ నర్సింహ సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం మండల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. రికార్డులను చూశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి మొక్కలను నాటారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరిచడానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఫిర్యాదుదారులందరికీ ఒకే రకమైన సేవలందించాలన్నారు. రోజువారి డీడీ, ఈపీటీ కేసుల సంఖ్య పెంచాలన్నారు. అక్రమ రవాణా, సంఘ విద్రోహశక్తులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. సిబ్బందికి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఎస్పీ సీసీ రాంరెడ్డి, సీఐ రామకృష్ణ ఉన్నారు.

ఎడమ కాల్వలో యువకుడు గల్లంతు

- ఆస్పత్రికి తరలించేలోపు మృతి



అమరచింత: జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వలో ఈత కొట్టేందుకు వెళ్లి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకోంది. వివరాలు ఇలా.. అయిజ పట్టణంలో మటన్ షాప్‌ను నిర్వహిస్తున్న మహబూబ్‌పాషా (30) తన మామ అల్లావుద్దీన్‌తో కలిసి జూరాల ప్రాజెక్టుకు సోమవారం వచ్చారు. ప్రాజెక్టు అందాలను చూస్తు చేప వంటకాల ఆరగించారు. పక్కనే పారుతున్న ఎడమ కాల్వలో సరదాగా ఈత కొడదామని అందులో దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మహబూబ్‌పాషా కొట్టుకుపోయాడు. విషయాన్ని గమనించిన అక్కడి జాలర్లు ఒడ్డుకు చేర్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ధరూర్ ఎస్‌ఐ ఔదార్యం..

ప్రాణపాయ స్థితిలో ఉన్న మహబూబ్‌పాషాను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే యత్నంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ధరూర్ ఎస్‌ఐ శివానందంగౌడ్ విషయాన్ని తెలుసుకుని తమ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. వేగంగా ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం..

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాల్వలో ఆదివారం సాయంత్రం గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం రాత్రి దాదాపు 9 గంటల వరకు కాల్వ వెంట గాలించినా ఆచూకి లభించలేదు. సోమవారం ఉదయం పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించగా, మండలంలోని భీంపురం – రేవులపల్లి మధ్య కాల్వలో మధు(25) మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

పుష్కరఘాట్ వద్ద యువకుడి హత్య

పెబ్బేరురూరల్: మండలంలోని రంగాపూర్ శివారు కృష్ణానది పుష్కరఘాట్ వద్ద గొల్ల రాజు (34)ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడి దారుణంగా హత్య చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపూర్ మండల జానంపేటకు చెందిన రాజు అమ్మమ్మ ఊరైన పెబ్బేరు మండలం వైశాఖపూర్‌లో ఉన్నాడు. 11ఏళ్ల క్రితం గుమ్మడం చెందిన సరస్వతిని వివాహం చేసుకొని అక్కడే డెకరేషన్, సప్లయర్స్ షాప్ నడుపుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం భోజనం అనంతరం నిద్రిస్తుండగా 2 గంటలకు ఫోన్ వచ్చింది. స్నేహితుడు వస్తున్నాడని, తనకు బీచుపల్లి ఆలయం చూపేందుకు వెళ్లి రాత్రికి తిరిగి వస్తానని భార్యకు చెప్పి వెళ్లాడు. భార్య సరస్వతీ పక్క ఇంటి వారి ఫోన్‌తో రాత్రి 11 గంటల వరకు చేయగా, ఫోన్ రింగ్ అవుతుంది కానీ ఎత్తడం లేదు. అలాగే సోమవారం మధ్యాహ్నం వరకు చుట్టుపక్కల బంధువుల ఊర్లలో వెతకడంతో పాటు సమాచారం ఇవ్వడంతో ఆచూకీ లభించలేదు. పుష్కరఘాట్ వద్ద మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ జగదీశ్వర్, క్లూస్‌టీం చేరుకుని పరిశీలించారు. మద్యం తాగి గుర్తుతెలియని వ్యక్తులు రాజును కత్తితో ఛాతిపై పొడవడంతో వెంటనే 10 మీటర్ల దూరం పరిగెత్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 13వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, సోమవారం రాత్రి 8 గంటల వరకు 10,500 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు పంపు ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 113, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, కుడి కాల్వకు 691, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్ట్ –2కు 750 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 863.4 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 863.4 అడుగుల నీటిమట్టం, 116.9 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 3.892 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేసి 5,935 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. పోతిరెడ్డిపాడు నుంచి 12వేల క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీశైలం జలాశయంలో 294 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

కేఎస్పీలో 27.3 అడుగుల నీటిమట్టం..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో సోమవారం సాయంత్రం వరకు 27.3 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఒక మోటార్ రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా యాసంగి పంటలకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు




ఉప్పునుంతల: మండలంలోని రాయిచేడ్ సమీపంలో సోమవారం ఉదయం అచ్చంపేటకు చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు దిగువకు వెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. 26 మంది విద్యార్థులతో బస్సు అచ్చంపేట వైపు వస్తుండగా కొత్తగా నిర్మిస్తున్న కల్వర్టు పక్క నుంచి తాత్కాలికంగా చేసిన దారి సరిగా లేక బస్సు అదుపు తప్పింది. విద్యార్థులంతా బస్సు దిగేశారు. కల్వర్టు పనులు త్వరగా చేయకుండా సాగదీస్తుండటంతోనే ప్రమాదంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు పనులు త్వరగా పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.

24 వరకు గాంధీ సినిమా ప్రదర్శన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని 7 సినిమా థియేటర్లలో గాంధీ సినిమాను ఉచితంగా ప్రదర్శించారని, 3681 మంది విద్యార్థులు తిలకించారని డీఈఓ రవీందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపులో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులతో పాటు ,తల్లిదండ్రులు, ఇతర ప్రజలు సినిమా ఉచితంగా చూసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ఏవీడీ, బాలాజీ, తిరుమల, వెంకటాద్రి, వెంకటేశ్వర, శ్రీనివాస థియేటర్లో, అదేవిధంగా జడ్చర్లలో శ్రీనివాస, దేవిలలో ప్రదర్శన ఉంటుందన్నారు. 15, 20 తేదీలు మినహా మిగతా రోజుల్లో ఈ నెల 24 వరకు ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 1: 30 గంటలకు వరకు ప్రదర్శనలు సాగుతాయన్నారు. అందరూ తిలకించాలని సూచించారు.

తెగిపడిన విద్యుత్ వైరు.. తప్పిన ప్రమాదం



మిడ్జిల్: మండల కేంద్రంలోని 33కేవీ సబ్‌స్టేషన్ నుంచి గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్ వైరు సోమవారం సాయంత్రం తెగి, జడ్చర్ల– కల్వకుర్తి ప్రధాన రహదారిపై చిరు దుకాణాల డబ్బాలపై పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మరమ్మతులు చేసేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది స్థానికంగా లేకపోవడంతో మూడు గంటలుగా మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ హైదరాబాద్‌లో నివాసం ఉంటూ నిత్యం అక్కడి నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. లైన్‌మెన్ జడ్చర్ల నుంచి, కట్టర్ ఉర్కొండ మండలం నుంచి వస్తూ విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి వేళలలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్, వైరు పోయిన గంటల తరబడి సరఫరా నిలిచిపోతుంది, వారు అక్కడి నుంచి వచ్చి మరమ్మతు చేసే వరకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.

మద్యం దుకాణాల టెండర్ల జాతర

- ఒకే రోజు 630దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 22దుకాణాలకు జీరో

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వానికి వచ్చే ఆదాయాల్లో అతి ముఖ్యమైంది మద్యం దుకాణాలు. రెండేళ్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కొత్త మద్యం దుకాణాల టెండర్లు స్వీకరిస్తున్న క్రమంలో రాష్ట్ర ఖజానకు భారీగా ఆదాయం వస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న 230మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 1,656 టెండర్లు దాఖలు కావడం వల్ల వాటి ద్వారా రూ.33.12కోట్ల ఆదాయం వచ్చింది. మద్యం వ్యాపారులు టెండర్లు వేయడానికి మరో నాలుగు రోజుల సమయం ఉన్న క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి ధరావత్తు సొమ్ము దాదాపు రూ.100కోట్ల వరకు ప్రభుత్వ ఖజానలో జమకానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం 630 టెండర్లు రాగా వీటిలో మహబూబ్‌నగర్, నారాయణపేట కలిపి 286, నాగర్‌కర్నూల్ 205, గద్వాల 84, వనపర్తి 55 వచ్చాయి. ఇప్పటి వరకు దాఖలు అయిన వాటిని పరిశీలిస్తే మహబూబ్‌నగర్, నారాయణపేట కలిపి 838, నాగర్‌కర్నూల్ 410, గద్వాల 250, వనపర్తిలో 158 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 22 మద్యం దుకాణాలకు ఒక్క టెండర్ కూడా పడలేదు. వీటిలో నారాయణపేట స్టేషన్ పరిధిలో 3, కోస్గి స్టేషన్ పరిధిలో ఒకటి, నాగర్‌కర్నూల్ జిల్లాలో 10 దుకాణాలు ఉన్నాయి. దీంట్లో నాగర్‌కర్నూల్ స్టేషన్ పరిధిలో 3, కొల్లాపూర్ ఒకటి, అచ్చంపేట రెండు, తెలకపల్లి 2, కల్వకుర్తి 2 దుకాణాలు ఉన్నాయి. వనపర్తి జిల్లాలో 8 దుకాణాలు ఉంటే దీంట్లో వనపర్తి స్టేషన్ పరిధిలో ఒకటి, కొత్తకోట 5, ఆత్మకూర్‌లో రెండు దుకాణాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలో ఉన్న అన్ని దుకాణాలకు టెండర్లు దాఖలయ్యాయి. అయితే మద్యం వ్యాపారులు చివరి రోజు వరకు ఎదురుచూసి ఏ దుకాణానికి తక్కువ టెండర్లు దాఖలు అవుతాయో పరిశీలించి అప్పుడు వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.


టెండర్ పత్రాలు అందిస్తున్న వ్యాపారులు

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాధలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్ర్యం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వహకులు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఴల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఴల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఴల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్ర్యం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్ర్య భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్ర్య దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్ర్య సమర యోధుల విజయగాధలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?


● ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

సాగుబడి

అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముస్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకోపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).